క్లుప్తంగా

రేపు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 29న మండల పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తెలిపారు. వెలుగు శాఖ, పశువైద్య శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

పడమటిపల్లెలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది

మార్కాపురం టౌన్: మండలంలోని గజ్జలకొండ పంచాయతీ పడమటిపల్లెలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ కృష్ణారెడ్డి పలువురు రోగులను పరీక్షించారు. టీబీ, బీపీ, సుగర్ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. తరచుగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడటం తదితర లక్షణాలుంటే ఆలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పెద్దన్న, సిబ్బంది సురేష్‌బాబు, శిరీష కుమారి, సంధ్య, మల్లీశ్వరి పాల్గొన్నారు.

కుంభమేళాకు మార్కాపురం నుంచి ప్రత్యేక సర్వీసు

మార్కాపురం టౌన్: ప్రయాగరాజ్‌లో వైభవంగా సాగుతున్న మహా కుంభమేళాకు మార్కాపురం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. కనీసం 30 మంది ప్రయాణికులు ఉండాలని, ప్రయాగరాజ్, వారణాసి, అయోధ్య, ఖజురహో తదితర ప్రాంతాలను కలుపుతూ యాత్ర సాగుతుందని పేర్కొన్నారు. 7 రోజుల టూర్ ప్యాకేజీ కింద ఒక్కొక్కరి నుంచి రూ.11500 చార్జీ వసూలు చేస్తామని తెలిపారు. భోజనం, టిఫిన్ ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. వివరాలకు 99592 25699ను సంప్రదించాలని డీఎం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

30న కంభంలో జాబ్ మేళా

కంభం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు అమర్ రాజా బ్యాటరీ, కేఎల్ గ్రూపు, అపోలో ఫార్మసీ కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 30 ఏళ్లలోపు వయసుండి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసిన నిరుద్యోగ యువతీయువకులు సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో హాజరు కావాలని స్పష్టం చేశారు. వివరాలకు 8109311043ను సంప్రదించాలని సూచించారు.

పచ్చచొక్కాలకే పశువుల షెడ్లు

వడ్డించేవాడు మనోడైతే బంతిలో చివర కూర్చున్నా అన్ని పదార్థాలు విస్తరిలోకి వస్తాయన్నది సామెత. అచ్చం ఇలాగే ఉంది గిద్దలూరు నియోజకవర్గంలో గోకులం షెడ్ల మంజూరు పరిస్థితి. కేవలం టీడీపీ శ్రేణులకు మాత్రమే పశువుల షెడ్లను కట్టబెట్టి మిగిలిన రైతులకు మొండి చేయి చూపిన తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. ఉపాధి హామీ పథకం నిధులతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గోకులం పథకం పేరుతో పశువులు, సన్నజీవాలు, కోళ్లకు షెడ్లు నిర్మించింది. అప్పుడు కూడా నిబంధనలకు నీళ్లొదిలి టీడీపీ కార్యకర్తలకే కట్టబెట్టిన వైనాన్ని గ్రామాల్లో రైతులు గుర్తు చేస్తున్నారు. అదే పథకాన్ని అడ్డుపెట్టి మళ్లీ అదే తరహాలో టీడీపీ నాయకులు, సానుభూతిపరులకే లబ్ధి చేకూర్చేలా పాలకులు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బేస్తవారిపేట: గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు 90 శాతం రాయితీపై గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు నుంచి ఆరు పాడి పశువుల వరకు షెడ్లు నిర్మించుకోవచ్చు. రెండు పాడి పశువులు ఉన్న రైతులకు రూ.1.15 లక్షలు, నాలుగు ఉన్న రైతులకు రూ.1.85 లక్షలు, ఆరు పాడి పశువులు ఉన్న రైతులకు రూ.2.30 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నుంచి 90 శాతం నిధులు చెల్లిస్తుంది. పాడి రైతు 10 శాతం మాత్రమే నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే అధికార పార్టీ నేతలు ఇందులో జోక్యం చేసుకుని తమ పార్టీ సానుభూతిపరులకే కేటాయించుకున్నారు. సామాన్య పాడి రైతుల నుంచి కనీసం అర్జీలు కూడా తీసుకోలేదు. అక్కడక్కడా అర్జీలు తీసుకున్నా బుట్టదాఖలు చేశారు. పశువైద్యాధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకురావడంతో చేసేదేమీ లేక అధికార పార్టీకి చెందిన వారికే షెడ్లు మంజూరు చేశారు.



రాచర్ల మండలం గౌతవరంలో కార్ల పార్కింగ్ కోసం గోకులం షెడ్డు

- పశువులు లేకున్నా టీడీపీ సానుభూతిపరులైతే చాలు
- 90 శాతం సబ్సిడీ సొమ్ము కోసం బరితెగింపు
- రెండు పశువులున్నవారికి ఆరు పశువులు పట్టే షెడ్లు మంజూరు
- సామాన్య రైతులకు మాత్రం మొండిచేయి
- కార్ల పార్కింగ్, ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్న తమ్ముళ్లు
- గిద్దలూరులో మండల పరిషత్ తీర్మానం లేక నిలిపివేత

నిబంధనలకు నీళ్లు.. తెలుగు తమ్ముళ్లకే మేలు

గ్రామాల్లో పచ్చ నేతలకే పశువుల షెడ్లు కేటాయించడంతో మిగిలిన పశుపోషకుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా ఇస్తున్న ప్రభుత్వ పథకాల సొమ్మును పచ్చనేతలే పంచుకుతింటున్నారని మండిపడుతున్నారు. పార్టీలకు అతీతంగా ఒక్క పశువుల షెడ్డు కూడా ఇవ్వలేదని, అధికార పార్టీకి చెందినవారినే ఎంపిక చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంభం మండలంలో ఒక్కరిని కూడా ఎస్సీ, ఎస్టీలను ఎంపిక చేయలేదు. పశు సంపద పూర్తి సమాచారం పశు వైద్యాధికారుల వద్ద ఉంది. ఎక్కువ శాతం రెండు పశువులు ఉన్న వారికి ఆరు పశువుల పరిమాణం గల షెడ్లను అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

■ కంభం మండలంలోని కందులాపురంలో జెడ్పీటీసీ మరిది కొత్తపల్లి మల్లికార్జున, పెద్దనల్లకాల్వలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎం.ఓంకారానికి పశువుల షెడ్లు కట్టబెట్టారు.

■ రాచర్ల మండలంలో ఆకవీడులో మాజీ సర్పంచ్ మరిది సూర ఆదినారాయణరెడ్డి, రాచర్ల టౌన్ టీడీపీ అధ్యక్షుడు దప్పిలి కాశిరెడ్డి, గౌతవరంలో పశువులు లేనటువంటి పాపిశెట్టి శ్రీనివాసులుకు గోకులం షెడ్లు మంజూరు చేశారు. శ్రీనివాసులు షెడ్డు నిర్మించుకుని కార్లు పార్కింగ్ చేసేందుకు ఉపయోగించడం గమనార్హం.

మండలం	మంజూరైన షెడ్లు	పూర్తయినవి	ప్రారంభించనవి	టీడీపీ శ్రేణులకు దక్కినవి	ఇతరులు
బేస్తవారిపేట	25	12	5	25	0
అర్ధవీడు	22	13	2	22	0
కొమరోలు	25	12	0	25	0
కంభం	23	10	3	23	0
గిద్దలూరు	0	0	0	0	-
రాచర్ల	22	18	0	22	0

■ కొమరోలు మండలంలోని బ్రాహ్మణపల్లెలో నీటి సంఘం అధ్యక్షుడు పి.మద్దిలేటి, ఎమ్మెల్యే బంధువులైన బాదినేనిపల్లె వాసి ముత్తుముల యల్లారెడ్డి, కొమరోలుకు చెందిన ముత్తుముల విజయ, పుల్లారెడ్డిపల్లెకు చెందిన దప్పిలి సావిత్రిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

■ బేస్తవారిపేట మండలంలో పీవీ పురంలో సర్పంచ్ కోడలు ఇండేల చంద్రకళావతికి పశువులు లేవు. కంభంలో నివాసం ఉంటున్న ఆమెను లబ్ధిదారుగా ఎంపిక చేశారు. బసినేపల్లెలో మాజీ సర్పంచ్ ఎల్.పెద్ద కోటేశ్వరరావు, జేబీకే పురంలో మాజీ సర్పంచ్ కుమారుడు శెట్లం రామకృష్ణ, పిటికాయగుళ్లలో ఎమ్మెల్యే బంధువు నారు వెంకటేశ్వరరెడ్డి, పెద్ద ఓబినేనిపల్లెలో మాజీ సర్పంచ్ కోడలు వెన్నా అంజలికి పశువుల షెడ్లు మంజూరు చేశారు. పశువులు లేకుండానే చెట్టిచర్లకు చెందిన ముంతల వెంకటేశ్వరరెడ్డి, గలిజేరుగుళ్లలో కమ్మునూరి చెన్నయ్య షెడ్లు నిర్మించుకున్నారు.

టీడీపీ సానుభూతి పరులైన సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, బంధువులు, టీడీపీ బూత్ కమిటీ నాయకులు, పశువుల వ్యాపారం చేసుకునేవారిని, పశువులే లేనటువంటి వ్యక్తులను పశువుల షెడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు పెట్టుకున్నా పక్కన పడేశారని నిజమైన పశుపోషకులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.



అనుములపల్లెలో గోకులం షెడ్డులో పొగాకు బేళ్ల నిల్వ

ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలి

- పోలీస్ సిబ్బందికి డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచన

తర్లుపాడు: స్థానిక పోలీసుస్టేషన్‌ను దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగు కేసులు, సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఎన్‌బీడబ్ల్యూ వారెంట్లపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో డీఎస్పీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట పొదిలి సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై బ్రహ్మనాయుడు, ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర్‌రావు, వీరభద్రస్వామి ట్రస్టు చైర్మన్ సాంబశివరావు, పలువురు నాయకులు ఉన్నారు.



తర్లుపాడు పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

మీ కోసంలో 18 అర్జీలు



ఆర్అర్ ప్యాకేజీ ఇప్పించాలని సబ్‌కలెక్టర్‌ను కోరుతున్న గుండంచర్ల గ్రామస్తులు

మార్కాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు తమ సమస్యలపై సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు అర్జీలు ఇచ్చారు. పట్టణానికి చెందిన పొట్టి వెంకట సుబ్బారావు మార్కాపురంలోని హిందూ శ్మశానవాటికలో ప్రహరీ, డీప్ బోరు, షెడ్ ఏర్పాటు చేయించాలని కోరారు. హిందూ శ్మశానవాటికలో కనీస వసతుల్లేవని, ఎవరైనా చనిపోతే ఖననం చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పెద్దారవీడు మండలం గుండంచర్ల, కాటంరాజు తండా గ్రామస్తులు తమకు ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని అర్జీ ఇచ్చారు. గుండంచర్లలో గత 20 ఏళ్లుగా తాము పొలాలను సాగుచేసుకుంటున్నామని, న్యాయం చేయాలని విన్నవించారు. సుమారు 30 కుటుంబాల వారికి ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరారు. ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు తాము సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామానికి చెందిన రామకృష్ణుడు తదితరులు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. మీ కోసం కార్యక్రమానికి మొత్తం 18 అర్జీలు అందాయని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

29న దివ్యాంగుల పరికరాలకు దరఖాస్తుల నమోదు

బేస్తవారిపేట: దివ్యాంగులకు అవసరమైన పరికరాల పంపిణీ చేసేందుకు వివరాల నమోదు ప్రక్రియ ఈనెల 29న గిద్దలూరులోని ఏరియా వైద్యశాలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు అలింకో సంస్థ ఆధ్వర్యంలో చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, అంధుల చేతి కర్రలు, ఎల్బో క్రచెస్, రోల్‌టైర్స్ ఇచ్చేందుకు గుర్తింపు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, వికలత్వాన్ని సూచించే రెండు ఫొటోలు, ఇన్‌కమ్ సర్టిఫికెట్, యుఐడీ కార్డు, ఫోన్ నంబర్‌తో హాజరుకావాలని సూచించారు.

ఆయా పోస్టు కోసం తన్నుకున్న తమ్ముళ్లు!

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని అంగన్‌వాడీ ఆయా పోస్టు కోసం టీడీపీలోని రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. ఆయా పోస్టు ఎవరికి ఇవ్వాలనే విషయంపై ఆదివారం ఓ రైస్ మిల్లులో అరుణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం అనే వ్యక్తులు తమ వర్గీయులతో కలిసి చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య మాటమాటా పెరగడంతో సుబ్రహ్మణ్యంపై అరుణ్‌కుమార్ దాడి చేశాడు. ఈ వివాదంలో సుబ్రహ్మణ్యంకు రక్త గాయాలయ్యాయి. దీంతో మండల టీడీపీ ముఖ్య నాయకులు స్థానిక టీడీపీ కార్యాలయానికి ఇరు వర్గాలను పిలిపించి సోమవారం క్షమాపణ చెప్పించారు.



అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్న మట్టి

చెరువు మట్టి.. చలో ఇటుక బట్టీ!

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడు చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల అనుమతి లేకుండా సెలవు రోజుల్లో అక్రమ రవాణాకు ఒడిగడుతున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో బేస్తవారిపేట పరిసర ప్రాంతాల్లోని ఇటుకల బట్టీలకు మట్టి తోలి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు మట్టి తోలుకుంటే పంటలు బాగా పండుతాయని రైతులు పొలాలకు తోలుకుంటుంటే అడ్డుకుంటున్న అధికారులు.. అక్రమంగా ఇటుకల బట్టీలకు రవాణా చేస్తుంటే పట్టించుకోవడం లేదు. పెంచికలపాడు చెరువు నుంచి నిత్యం మట్టి తోలుకోవడంతో లోతైన గుంతలు ఏర్పడుతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మోక్షగుండం గ్రామ రైతులు కోరుతున్నారు.



ఇటుకల బట్టి వద్ద డంప్ చేసిన చెరువు మట్టి

పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాలల్లో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గుమ్మా రాముడుయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమ్మరాంకట్ట సెంటర్, రాచర్ల గేటు సెంటర్, అమ్మవారిశాల రోడ్డు, గణేష్‌నగర్, గాంధీబొమ్మ సెంటర్ ప్రధాన రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా వ్యాపార దుకాణాల వద్ద భారీ వాహనాలు రోడ్డుపైనే నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం వల్ల పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. లారీల రాకపోకలకు నిర్ణీత సమయం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు



కలెక్టర్ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న వైద్యాధికారి గిరిధర్



ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు



అవార్డు అందుకుంటున్న మార్కాపురం వెలుగు ఏపీఎం పిచ్చయ్య



గిద్దలూరు ఎస్టీఓను సన్మానిస్తున్న వీఆర్ఓల సంఘం నాయకులు



బేస్తవారిపేట ఎంపీడీఓను సన్మానిస్తున్న సిబ్బంది

బేస్తవారిపేట: రిపబ్లిక్ డే సందర్భంగా ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, జిల్లా అధికారుల చేతులమీదుగా అవార్డులు అందుకున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని పలువురు సోమవారం అభినందించారు. బేస్తవారిపేట ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, మోక్షగుండం హోమియో వైద్యశాల వైద్యాధికారి పి.గిరిధర్, కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసులు ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

= గిద్దలూరు రూరల్: ఉత్తమ అవార్డు పొందిన గిద్దలూరు ఎస్టీఓ వరకుమార్‌ను వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.పి.రంగయ్యయాదవ్‌తోపాటు సంఘ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

= రాచర్ల: ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు, ఏఎస్సై ఆదిశేషయ్యను పలువురు అధికారులు అభినందించారు.

= మార్కాపురం: రిపబ్లిక్ డే వేడుకల్లో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న మార్కాపురం వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్యను ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.